క్లుప్తంగా

పేద మహిళలకు చీరల పంపిణీ

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు ఇండస్ట్రియల్ కాలనీలోని రామచంద్ర బౌద్ధారామం వద్ద జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా పలువురు పేద మహిళలకు గురువారం చీరలు పంపిణీ చేశారు. బౌద్ధ ప్రచారకుడు ధర్మానంద వీటిని మహిళలకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ భార్యాపిల్లలను, రాజ్యాన్ని విడిచి ఈ సమాజానికి విశ్వశాంతిని అందించిన గొప్ప వ్యక్తి బుద్ధుడు అని వివరించారు. దానం వలన మన మనసు, శరీరం పవిత్రమవుతుందన్నారు. కార్యక్రమంలో దాతలు, స్థానికులు పాల్గొన్నారు.

ఘనంగా మరిడిమాంబ పండగ మహోత్సవం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

సింధియా : కోరిన కోరికలు తీర్చే కల్పవల్లిగా పేరుపొందిన సింధియాలోని మరిడిమాంబ అమ్మవారి పండగ మహోత్సవాలు గురువారం ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరిగాయి. ఈ ఉత్సవాలకు దేశ, విదేశాల్లో స్థిరపడిన భక్తులు సైతం పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి ప్రధాన పండుగను పురస్కరించుకొని ఆలయ కమిటీ సభ్యులు భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లను చేశారు. పండగ ముగింపు మహోత్సవంలో భాగంగా అమ్మవారికి వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం జాతర మహోత్సవాన్ని భారీ బాణసంచా వెలుగుల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్థానిక సంప్రదాయానుసారం అమ్మవారి ఘటాలను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఈ వేడుకల్లో జీ.ఆర్.కే. గ్రూప్స్ అధినేత గోవింద రవికుమార్ దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు జోగారావు, కాకి అజయ్, శరణం సతీష్, రంగనాయకులు మరియు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

స్మార్ట్ ఎనర్జీ మీటర్ కోర్సులో ఉచిత శిక్షణ

పెదగంట్యాడ: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్ఏసీ), ఆంధ్రప్రదేశ్ స్టేట్ నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్తంగా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను కల్పించే లక్ష్యంతో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నాయి. ఈ విషయాన్ని ఎన్ఏసీ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.వి.ఎస్.ఎస్. రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూనియర్ టెక్నీషియన్ స్మార్ట్ ఎనర్జీ మీటర్ కోర్సులో పది రోజుల పాటు ఉచిత స్వల్పకాలిక శిక్షణను అందించనున్నారు. ముఖ్యంగా ఎలక్ట్రికల్ రంగంలో అనుభవం ఉన్నవారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. అభ్యర్థులు 21 సంవత్సరాలు నిండి 55 ఏళ్లలోపు వారై ఉండాలి. శిక్షణకు హాజరయ్యే వారికి ఎలక్ట్రికల్ రంగంలో కనీసం ఒక సంవత్సరం అనుభవం తప్పనిసరి. శిక్షణ సమయంలో ఉచిత వసతితో పాటు, స్టేషనరీ కూడా ఉచితంగా అందజేస్తారు. శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేస్తామని, ఆసక్తి గల అభ్యర్థులు మరింత సమాచారం కోసం 9394885164 నంబర్‌కు సంప్రదించాలని రవికుమార్ సూచించారు.

రేపటి నుంచి కేవీలో మిగులు సీట్ల భర్తీ ప్రక్రియ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కేంద్రీయ విద్యాలయంలో మిగులు సీట్ల భర్తీ ప్రక్రియ ఈనెల 14 నుంచి 18 వరకు జరగనుందని కేవీ ప్రిన్సిపాల్ వంశీకృష్ణ తెలిపారు. 4,5,6,9,10,12 తరగతులకు మిగిలిన సీట్లను ఆఫ్‌లైన్‌లో భర్తీ చేయనున్నామన్నారు. ఆ తేదీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. తుది ఫలితాలు జూన్ 20న లాటరీ ప్రక్రియ ద్వారా వెల్లడించనున్నట్టు ఆయన తెలిపారు.

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

పెందుర్తి: దువ్వాడ–గోపాలపట్నం రైల్వే లైన్ మధ్య గుర్తు తెలియని రైలు నుంచి జారిపడి ఓ గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం చెందినట్లు జీఆర్పీ పోలీసులు గురువారం గుర్తించారు. జీఆర్పీ సబ్ ఇన్‌స్పెక్టర్ కె.టి.ఆర్.లక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం.. మృతుని వయసు 35–40 ఏళ్లు ఉండవచ్చన్నారు. సిమెంట్ రంగు టీ షర్ట్, నేవీ బ్లూ ట్రాక్ ప్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కేజీహెచ్ మార్చురీలో ఉంచామన్నారు. వివరాలకు 73820 58996 ఫోన్ నెంబర్లో సంప్రదించాలని ఎస్ఐ సూచించారు.

బడిగంట మోగింది



స్నేహితుడిని ఆలింగనం చేసుకున్న విద్యార్థి



పిల్లలను స్కూల్‌కు తీసుకొస్తున్న తండ్రి



ఉపాధ్యాయులను పరిచయం చేస్తున్న ప్రధానోపాధ్యాయిని లంక అరుణకుమారి

విశాఖ విద్య: వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తిరిగి తెరుచుకోవడంతో ఎస్‌పీడీ సెంటర్‌లోని పాఠశాలలు విద్యార్థులు, వారి తల్లిదండ్రుల కోలాహలంతో కళకళలాడాయి. పుస్తకాల బ్యాగులు భుజాన వేసుకుని విద్యార్థులు బడికి రాగా, తొలిరోజు కావడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను దగ్గరుండి పాఠశాలల వరకు తీసుకొచ్చారు. ఎస్‌పీడీలోని ఓ పాఠశాలలో బడి తెరిచిన తొలిరోజుకు గుర్తుగా విద్యార్థులు సెల్ఫీలు తీసుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను అక్కడ నిలబెట్టి ఎంతో ఆసక్తిగా ఫోటోలు తీశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు అందజేశారు. ఎంఈవో దివాకర్ పలు పాఠశాలలను సందర్శించి, స్టూడెంట్ కిట్ల పంపిణీని పర్యవేక్షించారు. విద్యార్థులంతా పూర్తి స్థాయిలో పాఠశాలలకు వచ్చేలా ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలని, అడ్మిషన్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సూచించారు.

తగ్గిన అడ్మిషన్లు

గోపాలపట్నం: పాఠశాలలు గురువారం తిరిగి ప్రారంభమయ్యాయి. విద్యార్థుల రాకతో పాఠశాలలు కళకళలాడుతున్నాయి. ఇప్పటికే పాఠశాలలకు పుస్తకాలు, యూనిఫాంలు అందినప్పటికీ, బూట్లు, సాక్సులు ఇంకా అందాల్సి ఉందని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఇవి కూడా త్వరలోనే వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రెసిడెన్షియల్ కళాశాల, ఆర్పీ పేట, గోపాలపట్నం బాలుర, బాలికల పాఠశాలలు, కొత్తపాలెం, ఎల్లపువానిపాలెం, హెచ్‌సీ వెంకటాపురం ఉన్నత పాఠశాలల్లో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. గోపాలపట్నం పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతుల్లో 70 మందికి పైగా విద్యార్థులు చేరగా, మిగిలిన పాఠశాలల్లో పదుల సంఖ్యలో చేరికలు ఉన్నాయని అధికారులు తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే చేరికలు బాగా తగ్గాయని చెబుతున్నారు. పదో తరగతి పూర్తయ్యాక సుమారు 200 మందికి పైగా విద్యార్థులు బయటకు వెళ్లగా, ఆ సంఖ్యకు చేరుకోగలమా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



61వ వార్డు ప్రాథమిక పాఠశాలలో పనిచేయని ఆర్వో వాటర్ ప్లాంట్

అంతంతమాత్రం హాజరు

మల్కాపురం: వేసవి సెలవుల అనంతరం జీవీఎంసీ పాఠశాలలు గురువారం తిరిగి తెరుచుకున్నాయి. విద్యార్థులు మొదటి రోజు తరగతులకు అంతంతమాత్రంగా హాజరయ్యారు. మొత్తానికి పాఠశాలల్లో తక్కువ మంది విద్యార్థులతో.. కొత్తగా చేరిన వారిని పలకరించుకుంటూ మొదటిరోజు ప్రశాంతంగా సాగింది. మరోవైపు, పలువురు ఉపాధ్యాయులు బదిలీ కావడంతో కొత్తగా వచ్చిన టీచర్లు తమ తరగతి విద్యార్థులతో పరిచయం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. 61వ వార్డులోని మల్కాపురం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం 'నాడు–నేడు' ప్రాజెక్టు కింద ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్ నిరుపయోగంగా మారడంతో తాగునీటి ఇబ్బంది పడాల్సి వచ్చింది.



లక్ష్మీనగర్ స్కూల్లో తరగతుల నిర్వహణ



ఎస్‌పీడీలోని ఓ స్కూల్లో తొలిరోజు గుర్తుగా సెల్ఫీ కోసం ఏర్పాట్లు



పాఠశాలలో విద్యార్థుల సందడి



ఎస్‌పీడీలోని పాఠశాల వద్ద కోలాహలం

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు



బాబా పూజలలో పాల్గొన్న ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డులోని గుల్లలపాలెం, మహాత్మా గాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న సద్గురు షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. షిర్డీ నుంచి తీసుకువచ్చిన బాబా దివ్య పాదుకలను మందిరంలో ప్రతిష్ఠించి, ఆలయ ప్రధాన అర్చకులు చంద్రశేఖర్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పాదుకలను వచ్చే నెలలో ఆలయం వద్ద జరగనున్న గురుపౌర్ణమి పూజా కార్యక్రమంలో భక్తులకు అందజేస్తామని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి గుర్తుగా మధ్యాహ్నం బాబా మందిరం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. పూజా కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జీ. నాగేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడు మురళీకృష్ణ, కోశాధికారి పైలా దీపకుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పంపిణీకి విద్యా సామగ్రి సిద్ధం



తరగతి గదిలో భద్రపరిచిన పుస్తకాలు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డులోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. వీటిని శుక్రవారం నాడు నేరుగా తరగతి గదులలో ఉపాధ్యాయులు విద్యార్థులకు అందజేయనున్నారు. ప్రస్తుతం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, స్కూల్ యూనిఫాంలు, బ్యాగులు అందినట్లు అధికారులు తెలిపారు. అయితే, షూలు (బూట్లు) ఒక జత ఇంకా అందాల్సి ఉందని పేర్కొన్నారు.

ఈఎస్ఐ ఆస్పత్రిలో 'అల్ట్రా సౌండ్' సేవలు



అల్ట్రా సౌండ్ 2డి ఎకో స్కాన్ పరికరాలను ప్రారంభిస్తున్నషిప్‌యార్డ్ సీఎండీ హేమంత్‌ఖత్రి

సింధియా : హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ తన కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులతో సింధియాలోని కార్మిక బీమా ఆసుపత్రిలో రోగుల సౌకర్యార్థం అల్ట్రా సౌండ్ 2డి ఎకో స్కాన్ పరికరాలను గురువారం ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి హెచ్ఎస్ఎల్ చైర్మన్ , మేనేజింగ్ డైరెక్టర్ హేమంత్ ఖత్రీ , ఆయన సతీమణి వందన ఖత్రీ ముఖ్య అతిథులుగా హాజరై పరికరాలను ప్రారంభించారు. అనంతరం ఆస్పత్రి ఆవరణలో మహిళల కోసం ఏర్పాటు చేసిన సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని కూడా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సుమారు 150 మంది మహిళలకు క్యాన్సర్ వ్యాక్సిన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హేమంత్ ఖత్రీ మాట్లాడుతూ కార్మిక బీమా ఆస్పత్రికి అల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్ అందించడం అత్యంత అవసరమని గుర్తించి, ఉద్యోగుల సహకారంతో దీనిని అందించగలిగామని అన్నారు. ఈ పరికరాలు షిప్‌యార్డ్ కార్మికులతో పాటు పరిసర ప్రాంతాల ఉద్యోగులకు కూడా ఉపయోగపడాలని ఆయన ఆకాంక్షించారు. అదేవిధంగా నేటి మానవ జీవన విధానాలలో మార్పుల వల్ల మహిళలకు సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సినేషన్ ఇప్పించడం ఎంతో గొప్ప విషయమని ఆయన అభిప్రాయపడ్డారు. సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సిన్ తీసుకోవడం వల్ల మహిళల్లో బ్రెస్ట్, బోన్ క్యాన్సర్, గర్భాశయ సమస్యల నుంచి రక్షించుకోవచ్చునని ఆయన వివరించారు. కార్యక్రమంలో షిప్‌యార్డ్ డైరెక్టర్ రాకేష్ ప్రసాద్, ఈఎస్ఐ ఆస్పత్రి సూపరింటెండెంట్ రమణమూర్తి, షిప్‌యార్డ్ గుర్తింపు యూనియన్ కార్మిక నాయకులు శ్రీరామ్మూర్తి, కార్మికులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

గోపాలపట్నం: ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువతి తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు ఎయిర్‌పోర్టు పోలీసులను ఆశ్రయించారు. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ ఘటన జీవీఎంసీ 52వ వార్డు, ఎస్‌పీడీ సమీపంలోని గణేష్‌నగర్‌లో చోటుచేసుకుంది. గణేష్‌నగర్‌కు చెందిన పురెడ్డి వెంకటేశ్వరరావు కుమార్తె పురెడ్డి ఆశా దీప్తి, ఈ నెల 4వ తేదీ మధ్యాహ్నం సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లినట్లు కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లింది. అయితే ఎంతకీ తిరిగి రాకపోవడంతో బంధువులు, స్నేహితుల ఇళ్లలో గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. సీఐ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో ఉమెన్ హెచ్‌సి పి. మహాలక్ష్మి దర్యాప్తు చేపడుతున్నారు. ఈ యువతి ఆచూకీ తెలిసిన వారు 9440904350 లేదా 9494431544 నంబర్లకు తెలియజేయాలని పోలీసులు కోరారు.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ సుదర్శనరావు

గోపాలపట్నం: ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్ పరిధి 104 ఏరియా బాపూజీనగర్ వాలీబాల్ గ్రౌండ్ వద్ద ఈ నెల 10న జరిగిన చోరీ కేసులో నిందితులను క్రైం ఎస్ఐ ఎం.సుదర్శన్ పట్టుకుని, రిమాండ్‌కు తరలించారు. వెస్ట్ సబ్ డివిజన్ సీఐ నిమ్మకాయల శ్రీనివాసరావు తెలిపిన వివరాలివి.. ఈ నెల 10వ తేదీన రాత్రి 10 గంటల సమయంలో స్థానికుడు ఎం.చిట్టిపడాల్, అతని స్నేహితుడు రాయిన అనీల్ కుమార్ వాలీబాల్ గ్రౌండ్ వద్ద కూర్చుని ఉండగా, పాత నేరస్తులైన సంపతిరావు సురేష్, గుమ్మడి కార్తీక్ వారిని బెదిరించి, వారి వద్ద ఉన్న వెండి చైన్, వెండి బ్రాస్‌లెట్ లాక్కున్నారు.. దీనిపై బాధితులు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ సుదర్శనరావు, సిబ్బంది కలసి కేసు దర్యాప్తు చేశారు. నిందితులను ఒక రోజులోనే గుర్తించి పట్టుకున్నారు. వారిలో సంపతిరావు సురేష్ గతంలో ఒక మర్డర్ కేసులో నిందితుడు. ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్ ఉంది. అలాగే గుమ్మడి కార్తీక్‌పై కూడా పెందుర్తి స్టేషన్‌లో గంజాయి కేసులు, ఎయిర్‌పోర్టు స్టేషన్‌లో చైన్‌స్నాచింగ్ కేసులు ఉన్నాయి. వీరిని రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ సుదర్శన్ రావును సీఐ శ్రీనివాసరావు అభినందించారు.

షిప్‌యార్డ్ కాలనీలో యోగా శిబిరం ప్రారంభం



యోగాసనాలు వేస్తున్న షిప్‌యార్డ్ ఉద్యోగులు

సింధియా: హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ పరిధిలోని షిప్‌యార్డ్ రెసిడెన్షియల్ కాలనీలో వారం రోజుల పాటు నిర్వహించనున్న యోగా శిబిరాన్ని సంస్థ జనరల్ మేనేజర్ ఎస్.కె.మహాపాత్రా గురువారం ప్రారంభించారు. సుమారు 50 మందికి పైగా ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులతో కలసి ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. అంతర్జాతీయ యోగా గురువు రాజన ఉమాకృష్ణ వారికి యోగాసనాలను నేర్పించారు. జనరల్ మేనేజర్ మహాపాత్రా మాట్లాడుతూ నిత్య జీవన విధానంలో యోగా ప్రాముఖ్యతను ఉద్యోగులకు వివరించారు. ఈ నెల 18వ తేదీ వరకు శిబిరం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

కేంద్ర విధానాలపై నిరసన



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

ఉక్కునగరం: విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో గురువారం జాతీయ స్టీల్ సంఘీభావ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్టీల్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి డి. ఆదినారాయణ, అదనపు ప్రధాన కార్యదర్శి జె. రామకృష్ణ మాట్లాడుతూ, గత నెలలో జైపూర్‌లో జరిగిన జాతీయ కౌన్సిల్ సమావేశాల్లో దేశంలోని అన్ని ప్రభుత్వ రంగ సంస్థల్లో (పీఎస్‌యూలు) ఎదుర్కొంటున్న సమస్యలపై సంఘీభావ దినోత్సవం జరపాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఉక్కు ప్రైవేటీకరణను తక్షణమే విరమించుకోవాలని, పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలని,హెచ్ఆర్ఏను పునరుద్ధరించాలని, కరెంటు చార్జీలను తగ్గించాలని, వేతన సవరణను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మసేనురావు, డొక్క నర్సింగరావు, ఎస్. మోహన్‌బాబు, శివరామకృష్ణ, కనకరాజు, చీకటి శ్రీనివాస్ తదితర కార్మిక నాయకులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు ఎన్ఆర్ఎల్ పునరుద్ధరించాలి



స్టీల్‌ప్లాంట్ ట్రస్ట్ కార్యదర్శి రామ్‌ప్రసాద్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు 90 శాతం నాన్–రిటర్నబుల్ రుణ సౌకర్యాన్ని తిరిగి పునరుద్ధరించాలని స్టీల్ ఐఎన్‌టీయూసీనాయకులు కోరారు. ఈ మేరకు గురువారం వారు స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ట్రస్ట్ కార్యదర్శి ఎస్. రామ్‌ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని పలు డిమాండ్లను ఐఎన్‌టీయూసీ నాయకులు రామ్‌ప్రసాద్ ముందుంచారు. ఉద్యోగులకు వలంటరీ ప్రావిడెంట్ ఫండ్ ఆప్షన్‌కు అవకాశం కల్పించాలని, థ్రిఫ్ట్ రుణ వసూళ్లను పే స్లిప్‌లో కట్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రస్తుతం కార్మికులకు అందుబాటులో ఉన్న పే సెక్షన్‌ను మార్చకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు పీవీ రమణమూర్తి, ఎస్ఏ నాయుడు, మొల్లి ఈశ్వరరావు, గోపాలరాజు, వెంకన్న, పోతారెడ్డి, రాజేష్, వైవీ సుబ్బారావు, మింది దేవుడు, బాలస్వామి, బంటు రాము, చట్టి సింహాచలం పాల్గొన్నారు. తమ డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలని వారు కోరారు.

ట్రాఫిక్ జామ్.. గంటన్నర అవస్థలు



ఊటగెడ్డ కూడలిలో ట్రాఫిక్ జామ్‌లో నిలిచిపోయిన వాహనాలు



ఎన్టీపీసీ రహదారిలో నిలిచిపోయిన వాహనాలు

పరవాడ: యలమంచిలి–పరవాడ రహదారి ఊటగెడ్డ కూడలిలో గురువారం ఉదయం ట్రాఫిక్ జామ్ అయింది. యలమంచి–పరవాడ రహదారి, ఊటగెడ్డ–ఎన్టీపీసీ రహదారుల్లో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. ఊటగెడ్డ కూడలి వద్ద రెండు భారీ వాహనాలు ఇరుక్కుపోవడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. ఉదయం 8 గంటల సమయంలో ఏర్పడిన ట్రాఫిక్ సమస్యతో ఎన్టీపీసీ, హిందూజా, ఫార్మాసిటీ పరిశ్రమల్లో విధులకు హాజరయ్యే ఉద్యోగులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సుమారు గంటన్నర పాటు నిలిచిపోయిన ట్రాఫిక్‌లో భారీ వాహనాలు, ద్విచక్ర వాహనచోదకులు, బస్ ప్రయాణికులు చిక్కుకుని అవస్థలు పడ్డారు. పరవాడ పోలీసులు రంగంలోకి దిగి ట్రాఫిక్‌ను క్లియర్ చేయడంతో ప్రయాణికులు, ఉద్యోగులు, కార్మికులు ఊపిరిపీల్చుకున్నారు.

భైరవవాక మార్గాన్ని తెరవాలి

సింహాచలం: భైరవవాకకు వెళ్లే మార్గాన్ని బంద్ చేస్తూ అటవీశాఖ ఏర్పాటుచేసిన గేటుని తొలగించాలని విశాఖ జిల్లా బీజేపీ డిమాండ్ చేసింది. జిల్లా బీజేపీ అధ్యక్షుడు పరశురామరాజు ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు గురువారం భైరవవాక వద్ద నిరసన తెలిపారు. తొలుత భైరవస్వామిని దర్శించుకుని, స్వామికి అభిషేకం నిర్వహించారు. అనంతరం పరశురామరాజు మాట్లాడుతూ భైరవస్వామి దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తుంటారని, ఆలయానికి వెళ్లే కిలోమీటర్ మార్గాన్ని మూసేస్తూ అటవీశాఖ గేటు ఏర్పాటు చేయడం సరికాదన్నారు. దీంతో భక్తులు నడిచి వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వెంటనే గేటును తొలగించాలని డిమాండ్ చేశారు. అటవీశాఖ నిర్ణయం చాలా తప్పు అని, అసలు అటవీశాఖ పరిధిలో ఈ ప్రాంతం లేదని ఆరోపించారు. ఈ విషయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తామన్నారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.దామోదర్ యాదవ్, జిల్లా కార్యదర్శి నాదెళ్ల జ్యోతి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు ఉమ్మిడి సుజాతారాజ్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణచేస్తున్న అర్చకుడు, భక్తులు



నిత్యకల్యాణంలో తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా జరిపారు. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుంచి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

సిరులతల్లికి అభిషేకం

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.